క్వార్టర్ ఖాళీ చేస్తేనే ఎస్ఏబీఎఫ్ పెన్షన్

- స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల ఆగ్రహం
- కార్మిక సంఘాల వైఖరిపై అసహనం



స్టీల్‌ప్లాంట్ లోగో

ఉక్కునగరం: ఉక్కునగరంలో నివసిస్తూ రిటైర్ అయిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ (ఎస్ఏబీఎఫ్) పెన్షన్ నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఉద్యోగులను బలవంతంగా ఎస్ఏబీఎఫ్‌లోకి పంపడంతో పాటు క్వార్టర్ ఖాళీ చేసే వరకు పెన్షన్ చెల్లించకుండా నిలిపివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతుంది. ఈ అంశంపై కార్మిక సంఘాల వైఖరిపై రిటైర్డ్ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, యాజమాన్యం వాటాలతో 1995లో ఎస్ఏబీఎఫ్ ఏర్పడింది. ఉద్యోగులు రిటైర్ అయినప్పుడు ఎస్ఏబీఎఫ్ నగదు మొత్తాన్ని ఉద్యోగులకు చెల్లించేవారు. 2020 ఏప్రిల్‌లో కరోనా కాలంలో ఎస్ఏబీఎఫ్‌లో దాచుకున్న లక్షలాది రూపాయలను కొత్త పెన్షన్ స్కీంకు బదిలీ చేశారు. పెన్షన్ స్కీమ్‌లో చేరాలా, వద్దా అనే ఆప్షన్ ఉద్యోగులకు ఇవ్వకుండా ఏకపక్షంగా అందరినీ పెన్షన్ స్కీమ్‌లో చేర్చేశారు. ఆ ఎస్ఏబీఎఫ్ నగదు కూడా కార్పొరేట్ సంస్థల్లో డిపాజిట్ చేసి, పెన్షన్ ఇచ్చేలా ఒప్పందం చేశారు. ఉద్యోగులు డిపాజిట్ చేసే నగదుపై 1.8 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఉద్యోగి రూ. 10 లక్షలు డిపాజిట్ చేస్తే జీఎస్టీగా రూ. 18 వేలు సర్వీసు ప్రొవైడర్లు వసూలు చేస్తున్నారు. అంటే ఉద్యోగి దగ్గర 5 నెలల పెన్షన్ నగదు జీఎస్టీ రూపంలో తీసుకుంటున్నారు. ఇది ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది.

ఇదిలా ఉండగా ఉక్కునగరంలో నివాసం ఉంటున్న ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత 4 నెలల వరకు తమకు కేటాయించిన క్వార్టర్‌లో ఉండవచ్చు. ఇందు కోసం యాజమాన్యం ఉద్యోగి ఫైనల్ సెటిల్‌మెంట్ నుంచి రూ. 50 వేల నుంచి రూ. లక్షా యాభై వేలు వరకు ఉంచుకుని, ఉద్యోగి క్వార్టర్ ఖాళీ చేసిన వెంటనే డిపాజిట్ చేసిన నగదును తిరిగి చెల్లించేవారు. ప్రత్యేక పరిస్థితుల్లో కార్మికులు రెండేళ్ల వరకు క్వార్టర్‌లో ఉండే అవకాశం ఉంది. అయితే గత మూడు నెలలుగా రిటైర్డ్ ఉద్యోగుల ఎస్ఏబీఎఫ్ నగదును సర్వీస్ ప్రొవైడర్లకు ఇవ్వకుండా నిలుపుదల చేశారు. తద్వారా ఉద్యోగులు క్వార్టర్ ఖాళీ చేసే వరకు పెన్షన్ కూడా ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రస్తుత గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, గత గుర్తింపు సంఘం సీఐటీయూ, ప్రతిపక్ష సంఘం ఐఎన్‌టీయూసీ నాయకుల పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తింపు సంఘం స్పందించాలి



ఎస్ఏబీఎఫ్‌పై కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై గుర్తింపు సంఘం స్పందించాలి. ఎస్ఏబీఎఫ్‌లో చేరికపై ఉద్యోగులకు ఆప్షన్ ఇవ్వాలి. క్వార్టర్ ఖాళీ చేసే వరకు పెన్షన్ నిలిపివేయడం అన్యాయం. క్వార్టర్ ఖాళీ విషయంలో పాత పద్ధతి కొనసాగించి కార్మికులకు ఎస్ఏబీఎఫ్ పెన్షన్ రిటైర్ అయిన వెంటనే చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలి. గత గుర్తింపు సంఘం సీఐటీయూ, ప్రస్తుత గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీల వల్లే కార్మికులకు ఈ పరిస్థితి తలెత్తింది.

–నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి,
స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకుడు

బస్టాండ్ వద్ద ప్రైవేట్ ట్యాక్సీల హవా

- బస్సులు వచ్చేసరికి ప్రయాణికులు ఖాళీ
- పాతగాజువాక బస్టాప్‌లో మారని తీరు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



పాతగాజువాక బస్టాప్ వద్ద తిష్ట వేసిన ట్యాక్సీలు



ప్రయాణికుల కోసం బస్టాప్‌లో ఆగిన ఓనర్ బోర్డు కారు

గాజువాక : పాతగాజువాక జంక్షన్‌లోని నర్సీపట్నం బస్టాండ్‌లో ప్రైవేట్ ట్యాక్సీల హవా నడుస్తోంది. దీనిపై ఆర్టీసీ అధికారులు సరిగ్గా దృష్టి సారించకపోవడంతో బస్ ప్రయాణికులను తమ కార్లలో ఎక్కించుకొని వెళ్లిపోతున్నారు. ఈ విషయంపై ఇటీవల సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన తరువాత అధికారులు కొద్దిరోజుల పాటు ప్రైవేట్ ట్యాక్సీలను నియంత్రించారు. అంతా సర్దుకొంటున్న సమయంలో అధికారులు రిలాక్స్ అయిపోయారు. దీంతో ప్రైవేట్ ట్యాక్సీల జోరు మళ్లీ మామూలైపోయింది. నర్సీపట్నం, ఎలమంచిలి, తుని, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లడం కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులను ఈ వాహనాల డ్రైవర్లు తరలించుకుపోతున్నారు. ఈ స్టాప్ దగ్గర బస్సుల కంటే ముందుగా ట్యాక్సీలు, వివిధ ప్రాంతాలకు వెళ్లే ఓనర్ బోర్డు కార్లు కూడా ఆగి ఉంటున్నాయి. బస్సు రావడానికి కొద్ది సమయం ముందు బస్టాప్‌లోనే తిష్టవేసి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లిపోతున్నారు. కొన్ని కార్లను బస్టాప్‌లోనే ఆపుతుండగా, మరికొన్ని కార్లను బస్టాప్‌కు ఆనుకొని ఉన్న షాప్‌ల వద్ద ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో ఆర్టీసీ తన ఆదాయాన్ని కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. వైట్ బోర్డు కార్లను ట్యాక్సీలుగా ఉపయోగించే వీలు లేనప్పటికీ సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో వారు యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారు.

అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం

పాతగాజువాక బస్టాప్‌లో ప్రైవేట్ ట్యాక్సీలు, ప్రైవేట్ వాహనాలను అడ్డుకోవడానికి అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. ట్రాఫిక్ మానిటరింగ్ సిబ్బంది కోసం రీజనల్ మేనేజర్‌కు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. త్వరలోనే పూర్తిస్థాయిలో దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ, గాజువాక డిపో మేనేజర్

క్లుప్తంగా

సీబీఎస్ఈ టెన్త్ టాపర్స్‌కు సత్కారం



పదో తరగతి టాపర్స్‌ను సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఉక్కునగరం: స్థానిక సృష్టి వరల్డ్ స్కూల్లో సీబీఎస్ఈ పదో తరగతి టాపర్స్‌ను పాఠశాల యాజమాన్యం సత్కరించింది. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి. సుశీలారాణి, ఈడీ డాక్టర్ కె. మేఘన మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 39 మంది పరీక్షలు రాయగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 9మంది డిస్టింక్షన్, 26మంది ఫస్ట్ క్లాస్, నలుగురు సెకండ్ క్లాస్ సాధించారని తెలిపారు. నీహారిక, గిరిజ అత్యున్నత మార్కులు సాధించినట్లు చెప్పారు. చీఫ్ ప్రిన్సిపాల్ శ్రీధర్ బాబు, ప్రిన్సిపాల్ ఇ. చంద్రిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బుల పంపిణీ



కార్మికులకు సబ్బులు అందిస్తున్న కార్పొరేటర్ జగన్నాథం

కూర్మన్నపాలెం: ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం అన్నారు. వార్డులోని వడ్లపూడి సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు గురువారం సబ్బులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచడమే కాక వారి భద్రత దృష్ట్యా పలు సంక్షేమ పథకాలను, వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. అంకితభావంతో పని చేసి విశాఖ నగరాన్ని వ్యాధులరహిత నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, శ్రీను, మూర్తి, సచివాలయ సెక్రటరీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ ఉరుకూటి చందు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు సీతానగరం గ్రామంలో నిర్వహిస్తున్న దుర్గమాంబ అమ్మవారి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. అమ్మవారిని 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ముసిలి శ్రీనివాస్, కురందాస్ వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా దుర్గమాంబ పండగ



సీతారాములు, హనుమాన్ వేషధారణలో చిన్నారులు

గాజువాక : స్థానిక పాత కర్నవానిపాలెం గ్రామ దేవత దుర్గమాంబ పండగ మహోత్సవాన్ని గురువారం కనులపండువగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంతార సినిమా నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నపిల్లలు సీతారామ, లక్ష్మణ, హనుమాన్ వేషధారణల్లో అలరించారు. స్థానిక నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, సిరసపల్లి అప్పారావు, సూకరాజు, దేముడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



వృద్ధురాలికి నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 73వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పెదగంట్యాడ: ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 73వ వార్డు కొత్త కర్ణవానిపాలెంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. అలాగే ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో 95 శాతం పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కులుకూరి మంగరాజు, రామకృష్ణ, దాసరి పైడిరాజు, రాంబాబు, ఇరోతి సూర్యకుమారి, అప్పలరాజు, జనపరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంసిద్ధతా ఉత్సవ్



సంసిద్ధతా ఉత్సవ్‌లో చిన్నారులు

పెదగంట్యాడ: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నడుపూరు అంగన్‌వాడీ కేంద్రంలో సంసిద్ధతా ఉత్సవ్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పోషకాహారం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రమీల, పెంటమ్మ, కె.నిర్మల, శైలజ, లక్ష్మి, భవానీ, వేదవతి, ధనలక్ష్మి, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వరాలయంలో మాస శివరాత్రి పూజలు



పూజలు అందుకుంటున్న రామలింగేశ్వరుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వరాలయంలో గురువారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న దేవతామూర్తులను అలంకరించి పూజలు చేశారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, సురేంద్ర, కనకరెడ్డి, లలితారావు, శివరామకృష్ణ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



కచేరీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, శృతి, స్టీల్‌క్లబ్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక స్టీల్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. శృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ కచేరీలో ప్రముఖ విద్వాంసులు, విజయనగరం సంగీత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎ. నారాయణ గాత్ర మాధుర్యంతో శ్రోతలను ఆనంద డోలికల్లో ముంచెత్తారు. వయొలినిస్టు నీలాద్రిరావు, మృదంగం వాద్యకారుడు ఏడుకొండలు సహకారం అందించారు. అనంతరం వారిని శృతి, స్టీల్‌క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. అంతకు ముందు స్టీల్ ప్లాంట్ జీఎం (మెకానికల్) పి.ఎస్. ఘోష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా దాసరి ప్రతిభా అవార్డు గ్రహీత, సినీ దర్శకుడు డి. దివాకర్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో శృతి కార్యదర్శి ఎస్. రమణారావు, స్టీల్‌క్లబ్ కార్యదర్శి నారాయణ దొర, కె. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, కె.ఎల్. నరసింహం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల కోసం పార్కు అభివృద్ధి



జేసీబీతో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: స్థానిక సీడబ్ల్యూసీలోని ఖాళీ స్థలంలో పిల్లల కోసం పార్కును అభివృద్ధి చేయనున్నామని ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనిపెద్ది మసేనురావు, సీడబ్ల్యూసీ అధ్యక్షుడు నమ్మి సత్యనారాయణ తెలిపారు. సీడబ్ల్యూసీలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను జేసీబీ సాయంతో గురువారం తొలగించారు. వారు మాట్లాడుతూ ఇక్కడ మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. పిల్లలకు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉరుకూటి రమణయ్య, నందికి చిన్నారావు, నందికి తాతారావు, సీడబ్ల్యూసీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'పేదల మనోభావాలు దెబ్బతినేలా చంద్రబాబు వ్యాఖ్యలు'

అగనంపూడి: పేదల ఇళ్లపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు వారి మనోభావాలను దెబ్బ తీసేలా ఉన్నాయని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు యలమంచిలి అప్పారావు, పెదిరెడ్ల హరీష్ పేర్కొన్నారు. ఒక సెంటు భూమిలో సమాధులు కట్టుకోమని చంద్రబాబు అనడం సరికాదన్నారు. ప్రతీ పేదవాడికి సొంతిల్లు ఉండాలనే సంకల్పంతో రాష్ట్రంలోని పేదలందరికీ ముఖ్యమంత్రి ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని, మీ పాలనా సమయంలో ఎంతమందికి ఇళ్లు, స్థలాలు ఇచ్చారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

సిరుల తల్లికి సహస్ర తులసీపూజ



తులసీదళాల నడుమ కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవ వర్ణార్చన లక్ష్మీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

గంగవరం పోర్టు ఉద్యోగుల సమస్యలపై వినతి

పెదగంట్యాడ: గంగవరం పోర్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కోరారు. నగరానికి వచ్చిన చంద్రబాబును వేపగుంటలో గురువారం కలిసి, వినతి పత్రం సమర్పించారు.

ముగ్గురికి సరోగసీకి అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల వార్డులో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన సరోగసి(అద్దె గర్భం) మీద జిల్లా బోర్డు సమావేశం నిర్వహించారు. ముగ్గురు కుటుంబ సభ్యుల రిపోర్టులు పరిశీలించి సరోగసికి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, గైనకాలజీ వైద్యుడు డాక్టర్ సంజయ్, లీగల్ అడ్వైజర్ రమేష్,ఉమెన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, మానిటరింగ్ కన్సల్టెంట్ కె.శివాజీ ,జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు వీసీ అభినందన



విజేతలకు సర్టిఫికెట్లు బహూకరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నత్ భారత్ అభియాన్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. ఉన్నత భారత్ అభియాన్ లక్ష్యాలకు అనుగుణంగా కళాశాలల వారీగా ఈ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, యూబీఏ నోడల్ అధికారి ఆచార్య జి.నాగరాజు, ప్రాంతీయ సమన్వయకర్త బి.పావని, డాక్టర్ సోనీ హవీల, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



65వ వార్డులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు వుడానగర్ ఫేజ్–1లో మాటూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదచారులకు, ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన మాటూరి శ్రీనివాసరావు దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో దువ్వాడ సీఐ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వెలుగులు పరశురాముడు, చేగిండి శ్రీనివాసరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, యోహాను, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

65వ వార్డులో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీసీ రోడ్డులో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, పల్లా చినతల్లి పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఉక్కు పరిరక్షణ



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకమై ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకోవాలని కోరారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారానికి 826వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఈడీ, లూబ్రికేషన్ అండ్ ఫ్యాబ్రికేషన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఆకాంక్షించారు. పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కమిటీలో గైస్ ప్రిన్సిపాల్

మురళీనగర్ : 2023 పాలిసెట్ అడ్మిషన్ కమిటీలో విశాఖపట్నం గవర్నమెంట్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటరమణకు అవకాశం కల్పించారు. పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థుల ఎంపికలో ఈయన బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.